క్లుప్తంగా

వీధి దీపాలు ఏర్పాటు చేయించండి

జీడిమెట్ల: జీడిమెట్ల ఇండస్ట్రీయల్ ఏరియాలో చాలా చోట్ల ప్రధాన రోడ్లలో వీధిదీపాలు వెలగడం లేదు. పారిశ్రామిక ప్రాంతంలోని ఫేజ్–1, 2, 3లలో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. జీడిమెట్లలోని పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు వివిధ పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. చాలా మంది చిన్నపాటి కార్మికులు సైకిళ్లు, నడుచుకుంటూ పరిశ్రమలకు వెళ్తుంటారు. రాత్రి డ్యూటీలు ముగించుకుని ఇళ్లకు వచ్చే క్రమంలో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటిగా ఉండటంతో కార్మికులు ఇబ్బంది పడతుండగా మహిళా కార్మికులు భయపడుతున్నారు. ఈ విషయమై ఐలా అధికారులు పట్టించుకుని వీధి దీపాలు వెలగని చోట మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



బాపూనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న గౌరీష్, డీఈ పాపమ్మ

కుత్బుల్లాపూర్: మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ కార్పొరేటర్ గౌరీష్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి బాపూనగర్ వీకర్ సెక్షన్ కాలనీలో రూ.57 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన డీఈ పాపమ్మ, ఏఈ మల్లారెడ్డిలతో కలిసి పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు. మాజీ కార్పొరేటర్ సూర్యప్రభ, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, నాని, బాబూరావు, సుబ్బారావు, ప్రభాకర్‌రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

కంటివెలుగు కేంద్రం ప్రారంభం



బాచుపల్లిలో కంటి వెలుగు శిబిరంలో కార్పొరేటర్ కాసాని సుధాకర్

నిజాంపేట్: కంటి వెలుగుతో పేద ప్రజల కంటి సమస్యలు తొలగనున్నాయని నిజాంపేట్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలో బాచుపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, డాక్టర్ భవానీ ప్రసాద్, మెడికల్ సిబ్బంది వంశీ, సునీత, ఆశావర్కర్లు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నిజాంపేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం చెరువులో లభించిన ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి భైరుని చెరువులో బుధవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం తేలడంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడా లేదా ఆత్మహత్య చేసుకున్నాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'మనూ'కు గోల్డ్ గార్డెన్ అవార్డు

రాయదుర్గం: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్, అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్‌లో పచ్చదనానికి ఆలవాలంగా నిలిచిన ఉర్దూ విశ్వవిద్యాలయంకు గోల్డ్ గార్డెన్ అవార్డు లభించింది. ఇటీవల పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ నాగేశ్వర్‌రెడ్డి గోల్డ్ గార్డెన్ అవార్డు, సర్టిఫికెట్‌ను మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు.

పచ్చదనం మరింత పెంచాలి..

ఉర్దూ విశ్వవిద్యాలయంలో మరింత పచ్చదనం పెంచాలని వీసీ అధికారులకు సూచించారు. గోల్డ్ గార్డెన్ అవార్డు అందుకున్న ఈఈ నాగేశ్వర్‌రెడ్డి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఇంజనీర్ నాగేశ్వర్‌రెడ్డిను ఆయన అభినందించారు.

నేటి నుంచి బూస్టర్ డోస్

బాలానగర్: కోవాగ్జిన్ లేదా కోవిషీల్డ్ రెండు డోసుల చొప్పున తీసుకున్న వారు ×కార్బోవ్యాక్స్×టీకాను బూస్టర్ డోస్‌గా తీసుకోవాల్సి ఉంటుంది. గురువారం నుంచి బూస్టర్ డోసును బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇవ్వనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

ఈ జలమండలికి ఏమైంది.?

ఓవైపు మురుగు.. మరోవైపు తాగునీరు

- నిత్యం రోడ్లపై పారుతున్నా పట్టించుకోని వైనం
- తాగునీటి పైప్‌లైన్లకు తరచూ లీకేజీలు
- వృథాగా పోతున్న తాగునీరు
- అక్కడక్కడ డ్రైనేజీ వ్యర్థాల తొలగింపు
- బస్తీలు, కాలనీల్లో పొంగుతున్న డ్రైనేజీలు
- పట్టించుకోని జలమండలి అధికారులు



జగద్గిరిగుట్ట రిజర్వాయర్ వెళ్లే దారిలో రోడ్డుపై పారుతున్న మురుగు



గిరినగర్ బస్‌స్టాప్ వద్ద లీకేజీ ఏర్పడి నాలాలో కలుస్తున్న గోదావరి జలాలు



చింతల్: తాగునీటి వృథాకు ఉన్నతాధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా అడ్డుకట్ట పడటం లేదు. కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ డివిజన్ పరిధిలోని మూడు సబ్ డివిజన్లలో 10 సెక్షన్లు ఉన్నాయి. ప్రతి సెక్షన్‌లో నిత్యం తాగునీటి లీకేజీ పరంపర కొనసాగుతోంది. వేసవిలో తాగునీటి కోసం అల్లాడుతుంటే జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు రోడ్డుపాలు అవుతోంది.

- సెక్షన్ మేనేజర్లు, డీజీఎంలతో నిత్యం నీటి సరఫరా పర్యవేక్షించాల్సి ఉంటుంది. మేనేజర్లు కేవలం నూతన కనెక్షన్లపైన ఆధారపడుతూ నీటి సరఫరాలను గాలికి వదిలేసారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
- అంతేకాకుండా రోడ్డుపై మురుగు పారుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అక్కడక్కడ డ్రైనేజీల్లోని వ్యర్థాలను తొలగిస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో తొలగించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఒక్కో సెక్షన్ మేనేజర్ ఇద్దరూ ముగ్గురు చొప్పున అసిస్టెంట్లను ఏర్పాటు చేసి కార్యాలయంలో కూర్చుని కాలక్షేపం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సైట్‌లోకి వెళ్లడం.. సందర్శించడం.. అనంతరం అసిస్టెంట్ల పైన ఆధారపడటం పరిపాటిగా మారిందంటూ వినియోగదారులు జీఎం శ్రీధర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.
- కేవలం నూతన కనెక్షన్లపైన ఆధారపడుతూ నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ పర్యవేక్షణ గాలికివదిలేయడంతో తరచూ పైప్‌లైన్ లీకేజీలు, మ్యాన్ హోల్ పొంగిపొర్లుతున్నాయని అంటున్నారు.
- గిరినగర్ బస్‌స్టాప్ వద్ద వారం రోజుల క్రితం చిన్న లీకేజీ ఏర్పడి మంగళవారం రాత్రికి పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. ప్రధాన లైన్ కావడంతో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు తాగునీరు రోడ్డుపై పారింది.
- అదే విధంగా జగద్గిరిగుట్ట రిజర్వాయర్, సెక్షన్ కార్యాలయానికి వెళ్లే దారిలో నిత్యం మురుగు రోడ్లపై పారుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఓ వైపు తాగునీరు మరోవైపు మురుగు ఇలా ఏదో ఒక సెక్షన్‌లో లీకేజీ ఏర్పడటం పరిపాటిగా మారింది.
- గతంలోనే అధికారులు తీరు మార్చుకోవాలంటూ జీఎం శ్రీధర్ రెడ్డి పలుమార్లు హెచ్చరించినా పెద్దగా మార్పు రాలేదని స్థానికులు పేర్కొంటున్నారు. సెక్షన్ మేనేజర్లు అయితే తీరికగా మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యాలయానికి వచ్చిన తిరిగి 3గంటలకు వెళ్లిపోతున్నారు. సిబ్బందితోనే సెక్షన్లలో చేపట్టే పనులకు ఫొటోలు తీయించడం రిపోర్ట్‌లు తెప్పించుకోవడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది.
- సెక్షన్ మేనేజర్లు సిబ్బందితో ముఖ్యమైన పనులు చేపిస్తుండడంతో ఇలా సమస్యలు నిత్యం కొనసాగుతున్నాయని కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. మహిళ అధికారులు అయితే తాము కొత్తగా వచ్చామని పేర్కొంటూ తప్పించుకునే ధోరణిలో వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. జలమండలి కార్యాలయానికి ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయడం లేదని ఆయా బస్తీ, కాలనీవాసులు మండిపడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ నిజాంపేట్ ఫీడర్ పరిధిలోని నిజాంపేట్ ప్రధాన రోడ్డు, హెరిటేజ్ లైన్, పాలంపల్లి విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

- 11 కేవీ శ్రీనివాసకాలనీ ఫీడర్ పరిధిలోని శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, బాలాజీ మీడోస్, కేటీఆర్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

30 నుంచి భగవద్గీత తరగతులు

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 30 నుంచి మే 15 వరకు జరిగే ఈ తరగతుల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సమితి నిర్వాహకులు కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నం.90596 63440, 99492 36133లో సంప్రదించాలన్నారు.

క్రీడాకారుల సందడి

రాయదుర్గం: గోపన్‌పల్లి జవహర్ నవోదయ విద్యాలయంలో దివ్యాంగ క్రీడాకారుల సందడి నెలకొంది. బుధవారం జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా, ఆదిత్య మెహతా ఫౌండేషన్ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పారా స్పోర్ట్స్ క్రీడాకారుల ఎంపిక కొనసాగింది. నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ, జేఎన్‌వి రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ పర్యవేక్షించారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



బస్తీ దవాఖానాలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్: కంటివెలుగు శిబిరాలను కళ్ల సమస్యలతో బాధ పడుతున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌లోని బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాదాస్ వెంకటేష్, నాయకులు ఎంబరి ఆంజనేయులు, శామీర్ పేట హనుమంత్ రావు, మాజీ ఉప సర్పంచ్‌లు అమర్‌నాథ్, రాఘవేందర్ గౌడ్, బీఆర్ అస్ పార్టీ మునిసిపల్ వైస్ ప్రెసిడెంట్ శామీర్‌పేట రంగయ్య, మాజీ వార్డు సభ్యులు విజయ్‌కుమార్, బాలకృష్ణ, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి



చలివేంద్రానికి కుర్చీలు అందజేస్తున్న కార్పొరేటర్, రావులశేషగిరి, సుబ్బారాయుడు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ హెచ్‌ఏఎల్ నార్త్ కాలనీ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సుబ్బారాయుడు స్థానికంగా లలిత భక్తమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రానికి కుర్చీలను సమకూర్చారు. బుధవారం కార్పొరేటర్ రావులశేషగిరి చేతుల మీదుగా కుర్చీలను అందజేయగా ఆయన అభినందనలు తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో నవాబ్ భాయ్, మురళీకృష్ణ, నవీన్, మహేందర్‌రెడ్డి, మధు, శ్రీకాంత్, రాజు, హెచ్‌ఏఎల్ కాలనీవాసులు ఆంజనేయులు, వీరయ్య, సత్యనారాయణ మూర్తి, ప్రమీల లలిత, గాయత్రీ దేవి, జయలక్ష్మి, తుమరాజమ్మ తదితర ఉన్నారు.

ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాల కూల్చివేత



ప్రభుత్వ స్థలంలో వెలిసిన గదులను జేసీబీతో కూల్చి వేస్తున్న దృశ్యం



ప్రగతినగర్‌ను ఆనుకుని ఉన్న ఎస్ఎఫ్‌సీ స్థలంలో నిర్మించిన ప్రహరీని తొలగిస్తూ..

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలపై కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు మరోసారి పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం తెల్లవారుజామున ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలపై అటాక్ చేశారు. గాజులరామారం డివిజన్ సర్వే నంబర్.307లో ప్రగతినగర్‌ను ఆనుకొని ఉన్న ఎస్ఎఫ్‌సీ స్థలంలో ఓ వ్యక్తి తనకు స్థానికంగా స్థలం ఉందంటూ ఏకంగా రెండు ఎకరాల చుట్టూ ప్రహరీతో పాటు రెండు గదులను నిర్మించగా వాటిని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సర్వే నం. 342/1లో 12 బేస్‌మెంట్లను, 342లో ఒక గదిని నేలమట్టం చేశారు. తెల్లవారుజామున కబ్జాలపై ఒక్కసారిగా రెవెన్యూ అధికారులు విరుచుకుపడడంతో స్థానికంగా ఉన్న కబ్జారాళ్లు హడలెత్తారు.

ఇఫ్తార్



రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ అన్నారు. బుధవారం జీడిమెట్ల గ్రామంలోని కుతుబ్‌షాహీ మసీజీద్‌లో విశాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో 500 మంది ముస్లింలు పాల్గొని పత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇఫ్తార్‌ను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుతుబ్‌షాహీ మజీద్ అధ్యక్షుడు ఎండీ రషీద్, కోశాధికారి ఎండీ ముస్తఫా, మహమ్మద్, ఎండీ మక్బుల్, మజీద్ ఇమామ్ సనాఉల్లా, ఎండీ రియాజ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.
– కుత్బుల్లాపూర్

చెరువులో మునిగి వ్యక్తి మృతి

దుండిగల్: తాకిన మైకంలో ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రాకు చెందిన విశాల్(26), మాయ దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్‌లో నివాసముంటున్నారు. కాగా మద్యం సేవించే అలవాటు ఉన్న విశాల్‌తో ఈ నెల 17న అతని భార్య గొడవ పడింది. దీంతో అతను ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అయితే బుధవారం మధ్యాహ్నం చర్చిగాగిల్లాపూర్‌లోని చైతన్య కాలనీ సమీపంలో ఉన్న చెరువులో విశాల్ శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే మద్యం మత్తులో చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా.. లేదా కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడ్డా అన్నది తెలియాల్సి ఉంది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మృతి

నిజాంపేట్: వాటర్ ట్యాంకర్‌ను యూటర్న్ వద్ద వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టిన ఘటనలో వాటర్‌ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మక్తా ప్రాంతానికి చెందిన రమేష్ బాబు కిరాణా దుకాణం నడుపుతున్నాడు. అతడికి డీసీఎం వాటర్ ట్యాంకర్ (ఏపీ 28 వీ 3492) ఉంది. అయితే ట్యాంకర్ డ్రైవర్ శరణప్ప రాకపోవడంతో బుధవారం రమేష్‌బాబు ట్యాంకర్‌లో నీటి సరఫరా చేయడానికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో కోకకోలా చౌరస్తాలోని జేఎంజే స్నేహ సదన్ వద్ద మియాపూర్ నుంచి వచ్చిన డీసీఎం (టీఎస్ 07యూజీ 8750) డ్రైవర్ ఇండికేటర్ వేయకుండానే సడెన్‌గా యూటర్న్ తీసుకునే క్రమంలో రమేష్‌బాబు నడుపుతున్న డీసీఎం ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ట్యాంకర్ ముందు భాగం ధ్వంసం కావడంతో రమేష్‌బాబు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి



ఆటో ప్రచారాన్ని ప్రారంభిస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: వేసవి సెలవుల నేపథ్యంలో సొంత ఊళ్లకు వెళ్లే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పేట్‌బషీరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఆటో ప్రచారం చేపట్టారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లే ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే ఆయా ప్రాంతాల్లో గస్తీ పెడతామన్నారు. సాధ్యమైనంత వరకు కుటుంబ సభ్యుల్లో ఒకరిని ఇంట్లో ఉంచాలని కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో పక్కింటికి వారికి, బంధువులకు చెప్పి వెళ్లాలన్నారు. మీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు. పేట్‌బసీరాబాద్ సీఐ (9490617229), డీఐ (9490617178), పోలీస్ స్టేషన్ నంబరు (7901113913)లో సంప్రదించాలని కోరారు.

గ్రేవ్‌యార్డ్, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



మేయర్ నీలారెడ్డిని కలిసిన యునైటెడ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన బాచుపల్లి యునైటెడ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ సభ్యులు బుధవారం మేయర్ కొలన్ నీలారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. క్రిస్టియన్స్‌కు గ్రేవ్‌యార్డ్, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. యునైటెడ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ అబ్రహం, వైస్ ప్రెసిడెంట్ రవి రాజు, ట్రెజరర్ పుచ్చకాయల యెహోషువ, జాయింట్ సెక్రటరీ జేమ్స్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరాజు, బీఆర్‌ఎస్ బీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌ఓ ఒలింపియాడ్‌లో సత్తాచాటిన 'శ్రీచైతన్య'



ల్యాప్‌టాప్ సాధించిన విద్యార్థి శివసాయికుమార్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కుత్బుల్లాపూర్: జాతీయ స్థాయి ఐఎన్‌టీఎస్‌ఓ ఒలింపియాడ్ పరీక్షల్లో గుండ్లపోచంపల్లిలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం 321 మంది విద్యార్థులు ఐఎన్‌టీఎస్‌ఓ లెవల్–2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన శివసాయికుమార్ ల్యాప్‌టాప్ మోడల్‌ను సాధించగా, మితగా విద్యార్థులు ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సీమా, కొంపల్లి జోన్ ఏజీఎం రమణారావు, ప్రిన్సిపాల్ జీతేందర్‌లు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. మొత్తం 205 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు పొందారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో జోన్ డీన్ జయపాల్‌రెడ్డి, హాస్టల్ ప్రిన్సిపాల్ విక్రమ్, కో–ఆర్డినేటర్ సీతారామ్, డీన్ సోమేశ్ పాల్గొన్నారు.

మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలి

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- కొంపల్లి మున్సిపాలిటీలో ఆత్మీయ సమ్మేళనం
- పెద్దసంఖ్యలో హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు



కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



కార్యకర్తలకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: విపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్‌లో బుధవారం మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అధ్యక్షతన జరిగిన కొంపల్లి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యకర్తలే పార్టీకి శ్రీరామ రక్ష అని, కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తను తప్పక గుర్తిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టేందుకు విపక్షాలు కూడగట్టుకుని వస్తారని విమర్శించారు. వారికి సరైన బుద్ధి చెప్పేలా కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు.

తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలి..

- బీఆర్‌ఎస్ ప్రభుత్వం, నాయకులపై విపక్షాలు చేసే తప్పుడు ఆరోపణలను వెనువెంటనే తిప్పికొట్టేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సన్న కవిత, సీనియర్ నాయకులు బూర్గుబావి హనుమంతరావు, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రాజు, సంపత్ మాధవరెడ్డి, కస్తూరి బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల డివిజన్‌లో ప్రగతియాత్ర..

- ప్రగతియాత్రలో భాగంగా జీడిమెట్ల డివిజన్ మీనాక్షీ ఎస్టేట్స్‌లో స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. కోట్లాది రూపాయల నిధులతో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. గతంలో వరద సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న తమకు శాశ్వత పరిష్కారం చూపుతున్న నేపథ్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్, ప్రహల్లాద్, రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.